# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శుక్రవారం 13, ఫిబ్రవరి 2026


# నేడే పుర తీర్పు




- మూడు స్తంభాలాటలో గెలుపెవరిది ?
- బ్యాలెట్ బాక్సుల్లో దాగిఉన్న అభ్యర్థుల భవితవ్యం
- మున్సిపల్ పీఠంపై ఎవరి ధీమా వారిదే
- గెలిచినవారు గోడలు దూకకుండా క్యాంపులు ఏర్పాటు చేస్తున్న లీడర్లు
- ఊహకందని రీతిలో చెన్నూరు మున్సిపల్ ఎగ్జిట్ పోల్స్

చెన్నూరు టౌన్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త

మున్సిపల్ యుద్ధం ముగిసింది. ఇక గెలుపు ఎవరిది అనేది అభ్యర్థుల భవితవ్యం బ్యాలెట్ బాక్సుల్లో దాగి ఉంది. మంచిర్యాల జిల్లా చెన్నూరు మున్సిపాల్టీలో 18 వార్డులకు జరిగిన ఎన్నికల ఫలితాలు నేడు వెలువడనున్నాయి. ఉత్కంఠ భరితంగా సాగిన మున్సిపల్ పోరులో ఎవరు గెలుస్తారు, ఏ పార్టీకి ఎన్నిసీట్లు వస్తాయి? ఏ పార్టీకీ మున్సిపల్ పీఠం దక్కుతుందని రాజకీయ విశ్లేషకులు బేరీజులు వేసుకుంటున్నారు. ఇక అభ్యర్థుల విషయానికొస్తే ప్రచారంలో ఓట్లు అభ్యర్థించే క్రమంలో ఏమైనా లోపాలు జరిగాయా, ఓటు మనకు వేశారా అని లెక్కలు వేసుకుంటున్నారు. మున్సిపాలిటీలో 18 వార్డులకు గాను 19,903 ఓటర్లు ఉండగా 36 పోలింగ్ కేంద్రాల్లో 15,096 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. 75.85 శాతం పోలింగ్ కాగా మహిళలు 7,683 పురుషులు 7,412 ఇతరులు ఒకరు ఓట్లు వేశారని అధికారులు తెలిపారు. 2లో..






## మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్‌కు ఏర్పాట్లతో
# సర్వం సిద్ధం

✪ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.హరిత

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:

రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని రెండు మున్సిపాలిటీలకు జరిగిన ఎన్నికలకు సంబంధించి కౌంటింగ్ ప్రక్రియ కొరకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో ఏర్పాటుచేసిన ఆసిఫాబాద్ మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొరకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని, ఒక హాల్ లో 5 టేబుల్ ల చొప్పున 2 హాల్ లలో 10 టేబుళ్ళు ఏర్పాటు చేసి 20 వార్డులను 2 రౌండ్ లలో ఓట్ల లెక్కింపు చేయడం జరుగుతుందని తెలిపారు. కాగజ్ నగర్ మున్సిపాలిటీ కౌంటింగ్ కేంద్రాన్ని కాగజ్ నగర్ పట్టణంలోని డిఎవి పాఠశాలలో ఏర్పాటు చేయడం జరిగిందని, 30 వార్డులకు 2 రౌండ్లలో కౌంటింగ్ ప్రక్రియను పూర్తి చేయడం జరుగుతుందని, ప్రతి టేబుల్ కు ఒక కౌంటింగ్ సూపర్వైజర్, ఇద్దరు కౌంటింగ్ సహాయకులు విధులు నిర్వహిస్తారని తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం కౌంటింగ్ మిగతా 2లో..

# శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

✳ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆర్-సెటి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్‌లో ఏర్పాటుచేసిన శిక్షణ సంస్థను జోనల్ కార్యాలయం చీఫ్ జనరల్ మేనేజర్ ఎం. రవీంద్రబాబు, కరీంనగర్ రీజనల్ హెడ్ మిగతా 2లో..




# లేబర్ కోడ్‌లు రద్దు చేయాల్సిందే...

- ★ కార్మిక నేతల డిమాండ్
- ★ కార్మిక వ్యతిరేక విధానాలను రద్దు చేయాలి
- ★ సింగరేణి కార్మిక సంఘాల జేఏసీ నాయకులు
- ★ దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు భారీ స్పందన




తిర్యాని, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:

దేశవ్యాప్త సమ్మె పిలుపులో భాగంగా గురువారం తిర్యాని మండల కేంద్రం కార్మికుల నిరసనలతో హోరెత్తింది. సీపీఎం, సీఐటీయూ, అంగన్‌వాడీ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఈ ఆందోళన కార్యక్రమం భారీ ఎత్తున సాగింది. చింతపల్లి నుంచి కొమురం భీం చౌరస్తా వరకు కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కొమరం భీం చౌరస్తాలో బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ నేత టీకానంద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కొత్త మిగతా 6లో..



# నేడే పుర తీర్పు

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్ పార్టీ విషయానికొస్తే మంత్రి వివేక్ వెంకటస్వామి అధికారంలో ఉన్నందున మున్సిపల్ పీఠం ఎలాగైనా కైవసం చేసుకోవాలని దృఢసంకల్పంతో మొదటి నుంచి గెలుపే లక్ష్యంగా అన్నీ తానై ఎన్నికలను భుజాన వేసుకున్నాడు. గెలుపే లక్ష్యంగా చేసుకున్న మంత్రి వివేక్, మొదటి ఆయుధంగా ప్రతిపక్షాలను చీల్చి అందులోని లీడర్లకు పార్టీ తీర్థం పోశారు. ఎవరి మాట వినకుండా తనకు నమ్మకమైన వారికి బీఫామ్ ఇచ్చి పోటీలో నిలిపారు.

బీఆర్ఎస్ పార్టీ విషయానికొస్తే చెన్నూరు మున్సిపాల్టీలో మొదటి సారి జెండా ఎగురవేసిన అనుభవంతో పాటు, కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న వ్యతిరేక విధానాలు, ఆరుగ్యారంటీల్లో ఇప్పటివరకు అమలుకాని పథకాల పట్ల ప్రజలకు వివరిస్తూ ఓట్లు అభ్యర్థించుకోవడంలో సఫలీకృతం అయినట్లు ప్రజలు భావిస్తున్నారు.

బీజేపీ పార్టీ విషయానికి వచ్చేసరికి మొదటి సమస్య నాయకత్వలోపం. అభ్యర్థులే తమ నాయకులపై గుర్రుగా ఉన్నట్లు స్పష్టంగా కనబడిందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. అభ్యర్థుల్లో పట్టుదల ఉన్నప్పటికీ వారికి పూర్తి స్థాయిలో నాయకత్వం మద్దతు తెలుపకపోవడంతో అభ్యర్థులు కొంతమేర నిరుత్సాహానికి గురైనట్లు తెలిసింది. 18 వార్డు భాజపా అభ్యర్థి ఏతం వంశీకృష్ణ చేసిన ప్రసంగాలు చెన్నూరు పట్టణ ప్రజలను ఆకర్షించాయి. ఏదేమైనా ఈరోజు వెలువడే ఎన్నికల ఫలితాలు చెన్నూరు పట్టణ ప్రజలు ఎవరి ఒడిసిస్తారో, ఎవరిని గెలిపిస్తారో, ఏ పార్టీకి పట్టం కడతారో చూడాల్సి ఉంది.

## మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్‌కు ఏర్పాట్లతో సర్వం సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

ప్రక్రియ చేపడుతున్నామని, కౌంటింగ్ విధులు నిర్వహించే సిబ్బంది తమకు కేటాయించిన కౌంటింగ్ కేంద్రాలకు ఉదయం 6.30 గంటలకు చేరుకోవాలని, కౌంటింగ్ ప్రక్రియను పూర్తి బందోబస్తు మధ్య నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

అపర్ణరెడ్డి, ఆర్-సెటి సంచాలకులు ఆశిష్ వార్లే, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గణపతి లతో కలిసి శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మంచిర్యాల ప్రాంతంలో నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణను అందించి ఉపాధి కల్పించే దిశగా అనేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఇందులో భాగంగా సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో టాస్క్ కేంద్రం ద్వారా నిరుద్యోగ యువతకు శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా వృత్తి శిక్షణ కోర్సులలో నిరుద్యోగ యువతకు నైపుణ్యత కల్పించడం జరుగుతుందని, రోబోటిక్, మిషనరీస్, ఎలక్ట్రికల్ ఇతర కోర్సులలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకొని యువత స్వయం ఉపాధి పొందాలని, శిక్షణలో నేర్చుకున్న అంశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. యువతకి ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

జైపూర్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త



మండలం లోని రసూల్ పల్లి వద్ద గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో తూర్పాటి అభి (19) అనే యువకుడు దుర్మరణం చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.జగిత్యాల జిల్లా మేడిపల్లి గ్రామానికి చెందిన తూర్పాటి అభి, జగిత్యాల జిల్లా పెంబట్ల గ్రామానికి చెందిన పురాణం రవి, పస్తం అరుణ్‌లు ముగ్గురు స్నేహితులు పత్తి కూలి పని కోసం మేడిపల్లి గ్రామం నుండి చెన్నూరు కు ద్విచక్ర వాహనం పై బుధవారం సాయంత్రం వెళ్లారు. చెన్నూరు నుంచి గురువారం తెల్లవారుజామున బయలు దేరి తమ స్వగ్రామాలకు వెళుతుండగా, జైపూర్ మండలం లోని రసూల్ పల్లి, ఇందారం క్రాస్ రోడ్ మధ్యలో ప్రధాన రహదారిపై ఉన్న డివైడర్‌ను వేగంగా ఢీకొట్టడంతో అభి తలకు తీవ్రంగా గాయలై అక్కడిక్కడే మృతి చెందాడు. రవి, అరుణ్‌లు తీవ్ర గాయలపాలవడంతో చికిత్స కోసం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్య సేవల కోసం వారిని కరీంనగర్ నగర్ తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# కౌంటింగ్‌కు పూర్తి ఏర్పాట్లతో సిద్ధం

**- మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్**

నస్పూర్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త

2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నేడు ఉదయం 8 గంటల నుంచి జరగనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొరకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ముల్కల్లలో గల ఐజా ఇంజనీరింగ్ కళాశాలలో, బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలోని బజార్ ఏరియాలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, చెన్నూర్ మున్సిపల్ పరిధిలోని చెన్నూర్ పట్టణంలో గల అటవీ శాఖ కార్యాలయం వెనుక ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని సూపర్ బజార్ ఏరియాలో గల ఆర్.కె.సి.ఓ.ఎ. క్లబ్‌లో, లక్సెట్టిపేట మున్సిపల్ పరిధిలోని పాత మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఓట్ల లెక్కింపు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల కౌంటింగ్ కొరకు అదనపు సిబ్బందితో కలిపి 66 మంది కౌంటింగ్ సూపర్వైజర్లు, 132 మంది కౌంటింగ్ సహాయకులు, బెల్లంపల్లి మున్సిపాలిటీకి అదనపు సిబ్బందితో కలిపి 19 మంది కౌంటింగ్ సూపర్వైజర్లు, 37 మంది కౌంటింగ్ సహాయకులు, చెన్నూరు మున్సిపాలిటీకి అదనపు సిబ్బందితో కలిపి 10 మంది కౌంటింగ్ సూపర్వైజర్లు, 20 మంది కౌంటింగ్ సహాయకులు,, క్యాతనపల్లి మున్సిపాలిటీకి అదనపు సిబ్బందితో కలిపి 24 మంది కౌంటింగ్ సూపర్వైజర్లు, 48 మంది కౌంటింగ్ సహాయకులు, లక్సెట్టిపేట మున్సిపాలిటీకి అదనపు సిబ్బందితో కలిపి 9 మంది కౌంటింగ్ సూపర్వైజర్లు, 18 మంది కౌంటింగ్ సహాయకులను రాండమైజేషన్ ప్రక్రియ ద్వారా కేటాయించడం జరిగిందని తెలిపారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ బెల్లంపల్లి మున్సిపాలిటీకి సంబంధించి 34 వార్డులకు గాను 17 టేబుల్స్ ఏర్పాటు చేసి 2 రౌండ్లలో పూర్తి చేయడం జరుగుతుందని, చెన్నూరు మున్సిపాలిటీకి సంబంధించి 18 వార్డులకు గాను 9 టేబుల్స్ ఏర్పాటు చేసి, 2 రౌండ్లలో పూర్తి చేయడం జరుగుతుందని, లక్సెట్టిపేట మున్సిపాలిటీకి సంబంధించి 15 వార్డులకు గాను 8 టేబుల్స్ ఏర్పాటు చేసి 2 రౌండ్లలో పూర్తి చేయడం జరుగుతుందని, క్యాతనపల్లి మున్సిపాలిటీకి సంబంధించి 22 వార్డులకు గాను 22 టేబుల్స్ ఏర్పాటు చేసి రౌండ్‌కి 1 వేయి ఓట్ల చొప్పున 2 రౌండ్లలో పూర్తి చేయడం జరుగుతుందని, మంచిర్యాల నగరపాలక సంస్థకు సంబంధించి 60 వార్డులకు గాను 60 టేబుల్స్ ఏర్పాటు చేసి రౌండ్ కి 1 వేయి ఓట్ల చొప్పున లెక్కించడం జరుగుతుందని తెలిపారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో సజావుగా సాగేలా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

## బెదిరించిన విలేకరులపై కేసు నమోదు

జన్నారం, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త

జన్నారం మండలం కొత్తపేట గ్రామానికి చెందిన నూనవత్ విజేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురు విలేఖరులపై కేసు నమోదు చేసినట్లు జన్నారం ఎస్సై గొల్లపల్లి అనూష తెలిపారు. విజేశ్ తన ఇంటి నిర్మాణం కోసం కొత్తపేట వాగు నుండి ట్రాక్టర్లో ఇసుక నింపుకొని వస్తుండగా పోరు తెలంగాణ విలేఖరి అంబటి శరత్,జనం పవర్ విలేఖరి జితేందర్, చార్మినార్ ఎక్స్ ప్రెస్ విలేఖరి నవీన్ ఫోటోలు తీస్తూ మాకు ఐదు వేల రూపాయలు ఇవ్వాలని లేకుంటే ఫారెస్ట్ వారికి పట్టిస్తామని గత పదిహేను రోజులుగా బెదిరిస్తున్నారని జన్నారం పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జన్నారం ఎస్సై గొల్లపల్లి అనూష తెలిపారు.

## నేడు చెన్నూరులో 144 సెక్షన్ అమలు

- శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు
- విజయోత్సవ ర్యాలీలు, డీజే సౌండ్‌లకు అనుమతి లేదు
- జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ వెల్లడి

చెన్నూరు టౌన్, ప్రభాతవార్త

శాంతి భద్రతలకు ఎవరైనా విఘాతం కల్పించినట్లయితే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్, చెన్నూరు పట్టణ సీఐ బన్సీలాల్ పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు మున్సిపాల్టీలో ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా చెన్నూర్ పట్టణంలో 163 బీ.ఎన్.ఎస్.ఎస్ 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. జడ్పీ హైస్కూల్‌లో కౌంటింగ్ కేంద్రాలు ఉన్నందున కౌంటింగ్ కేంద్రం వద్ద ప్రజలు గుమిగూడి ఉండటం, కేకలు వేయడం నిషేదమని ఆయన తెలిపారు. రోడ్డుపై ట్రాఫిక్ కు ఇబ్బంది కలిగించరాదని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కౌంటింగ్ సెంటర్‌లోకి అభ్యర్థి, ఏజెంట్‌కు మాత్రమే ప్రవేశం ఉంటుందని, కౌంటింగ్ సెంటర్‌లోకి సెల్ ఫోన్ అనుమతించరాదని సూచించారు. పట్టణంలో విజయోత్సవ ర్యాలీలు, డీజే సౌండ్లు, టపాకాయలు పేల్చడం వంటి వాటిపై అనుమతులు లేవని తెలిపారు. ఈనెల 16వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందన్నారు. పట్టణంలో 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఇద్దరికి మించి గుమిగూడి ఉండకూడదని, ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించరాదని, నిబంధనలు అతిక్రమించి శాంతి భద్రతలకు విఘాతం కల్పించకూడదని పేర్కొన్నారు.



## క్రీడలు మానసికోల్లాసానికి దోహదం

**- మాసాడి విష్ణువర్ధన్ స్మారక క్రికెట్ పోటీలు ప్రారంభం**

తాండూర్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :



క్రీడలు క్రీడాకారులలో మానసికోల్లాసానికి, శరీర ధారుఢ్యం, స్నేహభావాన్ని పెంపొందిస్తాయని చౌటపల్లి సర్పంచ్ ముదాం సునీత, మాజీ ఎంపీపీ మాసాడి శ్రీదేవి అన్నారు. తాండూర్ మండలం చౌటపల్లి గ్రామంలో గురువారం మాసాడి విష్ణువర్ధన్ స్మారక క్రికెట్ పోటీలను నిర్వాహకులతో కలిసి వారు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటమి సహజమని, క్రీడా స్ఫూర్తితో ఆడి జట్టు విజయానికి కృషి చేయాలని సూచించారు. ఈ పోటీలలో చౌటపల్లి, అంకుశం, బోయపల్లి, ద్వారకాపూర్, కాసిపేట ఐదు గ్రామపంచాయతీలకు చెందిన జట్లు పాల్గొంటున్నాయి.వారం రోజుల పాటు జరిగే పోటీలలో విన్నర్ జట్టుకు రూ.10వేలు నగదు, షీల్డు, రన్నర్ జట్టుకు రూ.8 వేలు నగదు, షీల్డ్ అందజేస్తామని నిర్వాహకులు మాసాడి శశివర్ధన్, చాందా సురేష్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మాసాడి శ్రీరాములు, మాసాడి తిరుపతి, ముదాం రఘు, సుందిళ్ల భూమయ్య, డిటి రావు, చీమల రాయలింగు, బైరి శ్రీను, నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపును సజావుగా నిర్వహించాలి

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:



మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపును సజావుగా,ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ నితిక పంత్ తెలిపారు. గురువారం ఆసిఫాబాద్ పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలతో పాటు కాగజనగర్ పట్టణంలోని డివిఐ పబ్లిక్ స్కూల్లో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలను, స్ట్రాంగ్ రూమ్‌లను జిల్లా ఎస్పీ పరిశీలించారు.ఈ సందర్భంగా కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లు, సీసీటీవీ కెమెరాలు, కౌంటింగ్ హాల్స్, స్ట్రాంగ్ రూమ్ పరిసరాలు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు అవకాశం లేకుండా మూడు అంచెల భద్రతా వ్యవస్థను అమలు చేయాలని అధికారులకు సూచించారు. కౌంటింగ్ రోజున కేంద్రాల పరిసరాల్లో 163 బిఎన్ఎస్ఎస్ అమలులో ఉంటుందని, అనధికార వ్యక్తులకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు. అభ్యర్థులు, ఏజెంట్లు, సిబ్బంది తప్ప మరెవ్వరూ కౌంటింగ్ కేంద్రాల పరిధిలోకి రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. అదేవిధంగా కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు నిరంతర నిఘా, గస్తీ, కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాగజనగర్ లో డీఎస్పీ వాహిదుద్దీన్, కాగజనగర్ టౌన్ ఇన్స్పెక్టర్ ప్రేమ్ కుమార్, ఆసిఫాబాద్ లో ఎస్‌హెచ్‌వో బాలాజీ వర ప్రసాద్, మున్సిపాలిటీ కమిషనర్ గజానంద్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమం దిశగా ప్రభుత్వ శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలి

### ☆ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**బెల్లంపల్లి, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త**

ప్రజా సంక్షేమం దిశగా ప్రభుత్వ శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం రోజు జిల్లాలోని బెల్లంపల్లి మండల కేంద్రంలో గల సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని సబ్ కలెక్టర్ మనోజ్‌తో కలిసి సందర్శించి డివిజన్ పరిధిలో కొనసాగుతున్న పనులు, ప్రజా సంక్షేమ పథకాల అమలు అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రజల సంక్షేమ కార్యక్రమాలను పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. కార్యాలయంలోని విభాగాలను పరిశీలించి కార్యాలయం సొంత భవనం నిర్మాణం కొరకు స్థలాన్ని గుర్తించాలని అధికారులకు సూచించారు. బెల్లంపల్లి పట్టణంలోని బజార్ ఏరియాలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని సందర్శించి ఈ నెల 13వ తేదీన జరగనున్న కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. కౌంటింగ్ సిబ్బందికి అవసరమైన తాగునీరు, ఇతర ఏర్పాట్లు చేయడం జరిగిందని, ఓట్ల లెక్కింపులో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా లెక్కింపు ప్రక్రియ చేపట్టాలని తెలిపారు. పట్టణంలోని రామ్ నగర్ ప్రాంతంలో చేపట్టిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నిర్మాణ పనులను సందర్శించి త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ సంపత్, తహసీల్దార్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## వేసవి దృష్ట్యా నీటి పంపులకు మరమ్మతులు

**సారంగాపూర్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:**

వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని సారంగాపూర్ మండలం ప్యారమూరు గ్రామంలో నీటి పంపుల మరమ్మతు పనులను సర్పంచ్ మాక్యూర్ వరలక్ష్మి చేపట్టారు. రానున్న ఎండకాలంలో గ్రామ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యగా అన్ని కాలనీల్లోని చేతిపంపులను బాగు చేయించారు. నీటి ఎద్దడి తలెత్తకుండా సర్పంచ్ తీసుకుంటున్న ఈ చర్యల పట్ల కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తూ ఆమెను అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు, మల్టీపర్పస్ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరత కాంట్రాక్టు వర్కర్స్ పెండింగ్ వేతనాలు చెల్లించాలి

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:**

మిషన్ భగీరత కాంట్రాక్టు వర్కర్స్ పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మిషన్ భగీరత కాంట్రాక్టు వర్కర్స్ పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ కలెక్టర్ కార్యాలయంలో, మిషన్ భగీరథ కార్యాలయ ఏఈ సోనీ, ఎల్‌టి పీఎం ముత్తు స్వామి కి వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పెండింగులో ఉన్న 5 నెలల వేతనాలు చెల్లించడంతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వేతనాలు చెల్లించకుంటే 13 నుండి నిరవధిక సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. వినతిపత్రం అందజేసిన వారిలో మిషన్ భగీరథ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు చిరంజీవి, జిల్లా కార్యదర్శి భోగే ఉపేందర్, మిషన్ భగీరథ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు చాపిడి బాలేష్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జంషద్, జిల్లా ప్రధాన కార్యదర్శి షకీర్, కార్మికులు ఉన్నారు.



## మృతుని కుటుంబానికి సహాయం

**పెంచికల్ పేట్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :**

మండలంలోని కొండపల్లి గ్రామానికి చెందిన మానేపల్లి సిద్దయ్య గత రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా, మృతుని కుటుంబానికి 1వ వార్డు సభ్యుడు బందరకంటి శేఖర్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఆర్థిక సహాయం, నిత్యావసర సరుకులు బియ్యం, వంట నూనెను సేకరించి గురువారం సర్పంచ్ అన్నం రుక్మాబాయి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.



## గ్రామీణ అభివృద్ధికి ముందడుగు...

### - గ్రామ సమైఖ్య భవనాలకు భూమి పూజ

**పెంచికల్‌పేట్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :**

మండలంలోని పెంచికల్ పేట్, ఎల్లూర్ గ్రామాలలో ఉపాధి హామీ నిధులతో మంజూరైన గ్రామ సమైఖ్య భవనాల నిర్మాణ పనులకు ఎల్లూరులో ఎంపిడిఓ అల్బార్ట్, సర్పంచ్ రవీందర్, పెంచికల్ పేట్ గ్రామంలో ఉప సర్పంచ్ శేఖర్, కార్యదర్శి అర్చన ఆధ్వర్యంలో గురువారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ నిర్మాణ పనులను నాణ్యవంతంగా, త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ అక్షి త, ఉప సర్పంచ్ నారాయణ, వార్డు సభ్యులు సునీత దామోదర్, అశోక్, కార్యదర్శి చంద్రయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ ప్రేమనందం, గ్రామస్థులు సత్యనారాయణ, తులసీరామ్, రాజేష్, శ్రీకాంత్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.


విఓ భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపిడిఓ, సర్పంచ్



## ఉపాధి హామీ పనులు ప్రారంభం

**నర్సాపూర్(జి), ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:**

నిర్మల్ జిల్లా నర్సాపూర్(జి) మండల కేంద్రంలో ఉపాధి హామీ పనులను నూతన సర్పంచ్ గడ్డం ఇంద్రకరణ్ రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో అర్హులైన ప్రతి కూలీకి ఉపాధి కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. ఉపాధి హామీ పథకాన్ని కూలీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పనుల వద్ద కూలీలకు అవసరమైన కనీస సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రభాకర్, విట్టల్, ఈజీఎస్ సిబ్బంది, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.




## శివాజీ విగ్రహ ఏర్పాటుకు వినతి

**నర్సాపూర్(జి), ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:**

నర్సాపూర్ మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ కమిటీ సభ్యులు గురువారం తహసీల్దార్ శ్రీకాంత్‌కు వినతి పత్రం సమర్పించారు. మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో విగ్రహ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని ఈ సందర్భంగా కోరారు. శివాజీ మహారాజ్ ఆశయాలను స్మరించుకునేలా విగ్రహాన్ని నెలకొల్పాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సంతోష్, అశోక్, సవీన్, శివ, రానా, శ్రీను, మహేష్, సాయికృష్ణ, లింగం, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి

**తాండూర్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :**

రెండు వారాల కంటే ఎక్కువ దగ్గు, జ్వరం, రాత్రి చెమటలు, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉండే అనుమానితులు వెంటనే క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు ఝాన్సీరాణి, లక్ష్మి ్ర ప్రసన్న అన్నారు. గురువారం పిహెచ్‌సిలో టిబి ముక్త్ భారత్ అభియాన్ వైద్య శిబిరం నిర్వహించారు. వారు మాట్లాడుతూ క్షయ వ్యాధి లక్షణాలు ఉంటే తెమడ, ఎక్స్ రే పరీక్ష చేయించుకోవాలన్నారు. క్షయ వ్యాధి నిర్ధారణ జరిగితే ఉచితంగా చికిత్స, చికిత్స పూర్తయ్యే వరకు ప్రతినెల రూ.1000 చొప్పున పోషణ భత్యాన్ని ప్రభుత్వం అందిస్తుందన్నారు. క్షయ వ్యాధి తుంపర్ల ద్వారా ఒకరి నుంచి ఇంకొకరికి, మద్యం సేవించే వారికి, పొగాకు నమిలే వారికి ఎక్కువగా సోకే ప్రమాదం ఉందన్నారు. వ్యాధి నిరోధక శక్తి తక్కువ ఉన్నవారికి ఈ వ్యాధి తొందరగా వ్యాపిస్తుందని, అన్ని రకాల పోషకాహారాలు దొరికే ఆహారాన్ని తీసుకోవడం ఉత్తమ మార్గమన్నారు. సత్వరమే వ్యాధి నిర్ధారణ జరిగి చికిత్స ప్రారంభించి వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చున్నారు. ఈ సందర్భంగా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ శిబిరంలో 24 మందికి తెమడ, ఐదుగురికి చాతీ ఎక్స్ రే పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ముడి మడుగుల సురేష్, ఉప సర్పంచ్ సత్యనారాయణ, పంచాయతీ సెక్రటరీ దివాకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎండి ఈసా, మాజీ ఎంపీపీ సిరంగి శంకర్, ఎంఎల్‌హెచ్ పి ప్రసన్న కుమారి, డివిజన్ క్షయవ్యాధి సూపర్ వైజర్ శశికాంత్, కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ మేరీ, హెల్త్ సూపర్ వైజర్లు రమాదేవి, తార, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఏఎన్ఎంలు శోభరాణి, తిరుపతమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ హాక్నీ, తదితరులు పాల్గొన్నారు.






## లక్షెట్టిపేట మున్సిపాలిటీ ఎవరికి వరిస్తుందో?

**లక్షెట్టిపేట ఫిబ్రవరి 12, ప్రభాతవార్త**

మున్సిపల్ ఎన్నికల్లో 76.80 శాతం పోలింగ్ నమోదు కావడంతో అభ్యర్థుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. భారీగా ఓట్లు పోల్ కావడంతో గెలుపు పై ఎవరి ధీమాలో వారున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులకు రెబెల్స్ సెగ తగలడంతో ఓట్ల చీలికపై ఆందోళన నెలకొంది. బలమైన ప్రత్యర్థులు ఉన్న వార్డుల్లో గెలుపు అవకాశాలపై అభ్యర్థులు లెక్కలు వేసుకుంటున్నారు. ఓటరు ఎవరి వైపు మొగ్గు చూపాడో తెలియాలంటే ఫలితాల వరకు వేచి చూడాల్సిందే.

### బ్యాలెట్ బాక్స్‌ల్లో భవితవ్యం..

మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. అభ్యర్థుల భవితవ్యం బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తమైంది. పోలింగ్ ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకోగా, అభ్యర్థుల్లో మాత్రం ఉత్కంఠ పెరిగింది. ఎవరికి వారు గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నా, ఓటింగ్ సరళి పై స్పష్టమైన అంచనాకు రాలేక లోలోన ఆందోళన చెందుతున్నారు. అందరి దృష్టి ఇప్పుడు కౌంటింగ్ కేంద్రాల్లో భద్రపరిచిన బ్యాలెట్ బాక్సులపైనే ఉంది.



## రోబోటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన స్లేట్ స్కూల్ విద్యార్థులు

**జన్నారం, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త**

ఈ బాట్ ప్లస్ ఇన్నోవిటి రోబోటిక్స్ ఛాంపియన్‌షిప్ 2025-26 పోటీలలో మండల కేంద్రంలోని స్లేట్ ఎక్సలెన్స్ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించారని స్లేట్ విద్యాసంస్థల చైర్మన్ ఏనుగు శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. ఈ పోటీకి సంబంధించిన ఆన్లైన్ పరీక్ష జనవరి 10 వ తేదీన నిర్వహించగా స్లేట్ ఎక్సలెన్స్ స్కూల్ 7వ తరగతి కి చెందిన విద్యార్థులు శౌర్య, శ్రేయస్, వైభవలు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించి 5000 రూపాయలు నగదు బహుమతి అందుకున్నారు. ఈ సందర్భంగా స్లేట్ విద్యాసంస్థల చైర్మన్ ఏనుగు శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను చదువుతోపాటు సాంకేతిక రంగాలలో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో తీర్చిదిద్దడమే స్లేట్ విద్యాసంస్థల లక్ష్యమని భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి కన్న తల్లిదండ్రులకు, చదువుకున్న పాఠశాలకు, విద్య నేర్పిన గురువులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులను తీర్చిదిద్దిన ఈ బాట్ ఇంచార్జి ఉపధ్యాయురాలు శ్రావణి తో పాటు విద్యార్థులను చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, ప్రిన్సిపల్ శిరీన్ ఖాన్, ఉపాధ్యాయులు జాకీర్, అస్మా, తల్లిదండ్రులు అభినందించారు.

## సింగరేణి సీ అండ్ ఎండిని మర్యాద పూర్వకంగా కలిసిన ఎస్టీపిపి ఈడి

**జైపూర్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త**



ఎస్టీపిపి ఈడి సిహెచ్. చిరంజీవి సింగరేణి సంస్థ నూతన చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించబడిన జ్యోతి బుద్ధ ప్రకాష్‌ను గురువారం జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ ఈడి చిరంజీవి, ఎస్టీపిపి అధికారుల సంఘం అధ్యక్షుడు పంతులా మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# పారిశుధ్యం, పన్నుల వసూళ్లపై కఠిన ఆదేశాలు...

**- జిల్లా పంచాయతీ అధికారి - గ్రామాభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం సహించం**

**- అందుగులపేట గ్రామ పంచాయతీ ఆకస్మిక తనిఖీ**





**మందమర్రి, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా పంచాయతీ అధికారి డి. వెంకటేశ్వరరావు మందమర్రి మండలంలోని అందుగులపేట గ్రామ పంచాయతీని ఆకస్మికంగా సందర్శించి పలు కీలక సూచనలు చేశారు. గ్రామ పంచాయతీ పనితీరు, పారిశుధ్య నిర్వహణ, పన్నుల వసూళ్లు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను సమీక్షించారు. గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలను క్రమబద్ధంగా నిర్వహించి ఎక్కడా ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇంటింటి చెత్త సేకరణ సమయంలో ట్రాక్టర్లకు గన్ని సంచులు అమర్చి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని సూచించారు. కంపోస్టు షెడ్‌లో వర్మీ కంపోస్ట్ ఎరువును తయారు చేసి వినియోగించాలన్నారు. ఇంటి పన్ను వసూళ్ల వేగవంతం చేసి ఈ నెల 15వ తేదీలోగా 100 శాతం వసూలు పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీలోని అన్ని రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించి అప్డేట్ చేయాలని, పెండింగ్‌లో ఉన్న ట్రేడ్ లైసెన్సులను వెంటనే రీన్యువల్ చేయాలని సూచించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న ఫైనాన్షియల్, నాన్‌ఫైనాన్షియల్ ఆడిట్ పేరాలను త్వరితగతిన క్లియర్ చేయించుకోవాలని చెప్పారు. పంచాయతీ కార్యదర్శులు ప్రతిరోజూ ఉదయం విధులకు హాజరై 9 గంటల లోపు పి.ఎస్. యాప్‌లో హాజరు నమోదు చేసి, డీఎస్ఆర్ నమోదు చేయాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంలో మండల పంచాయతీ అధికారి ఎం. సత్యనారాయణ, సర్పంచ్ ముత్యం రమ, ఉప సర్పంచ్ దుర్గం శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి కె. వీరేందర్, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల లెక్కింపునకు పటిష్ట ఏర్పాట్లు: కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:**



మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీల వారీగా లెక్కింపు విధుల్లో పాల్గొనే సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కౌంటింగ్ ప్రక్రియలో సమయపాలన అత్యంత ముఖ్యమని, సిబ్బంది నిర్ణీత సమయానికి కేంద్రాలకు హాజరుకావాలని ఆదేశించారు. ఎన్నికల నియమాలను పాటిస్తూ అత్యంత పారదర్శకంగా, వేగంగా లెక్కింపు పూర్తి చేయాలని సూచించారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు వీరారెడ్డి మాట్లాడుతూ.. పోలింగ్ విజయవంతంగా ముగిసినట్లే, అదే క్రమశిక్షణతో లెక్కింపును కూడా పూర్తి చేయాలన్నారు. అనంతరం కౌంటింగ్ హాల్స్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

**- డిఎంఎఫ్‌టి నిధులతో నూతన బోర్లు ఏర్పాటు**

**వేమనపల్లి, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త**



మండలంలోని పలు గ్రామాల్లో తాగు నీటి సమస్య తీర్చేందుకు డిఎంఎఫ్‌టి నిధులతో నూతన బోర్లు ఏర్పాటు చేశారు. వివిధ గ్రామాలలో 21 బోర్లు మంజూరు కాగా గురువారం రోజున 10 బోర్లకు మాజీ జడ్పీటీసీ ఆర్. సంతోష్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సయ్యద్ సాబీర్ అలీ తో కలిసి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు చెన్నూరి సమ్మయ్య, కొట్రంగి శ్రీనివాస్, ముల్కల్ల శ్రీలత సత్యనారాయణ, మాజీ ఎంపీపీ ఆకుల లింగాగౌడ్, మాజి కోఆప్షన్ సభ్యులు జహీద్ అలీ, మాజీ వైస్ ఎంపీపీ ఒడిల రాజన్న నాయకులు పాల్గొన్నారు.



## క్రీడల ద్వారా ఆత్మవిశ్వాసం పెరుగుతుంది

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 12,ప్రభాతవార్త:**

క్రీడల ద్వారా ఆత్మవిశ్వాసం పెరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ ప్రభుత్వ క్రీడా పాఠశాల (బాలికలు)లో చేపట్టిన జిల్లా స్థాయి పోటీలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో దాగివున్న క్రీడా నైపుణ్యాన్ని మరింత మెరుగుపరిచేందుకు ప్రభుత్వం సిఎం కప్ పోటీలను నిర్వహిస్తోందని తెలిపారు. దీనిలో భాగంగా గ్రామీణ, మండల, నియోజకవర్గస్థాయి పోటీలను నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు జిల్లా స్థాయి పోటీలు నిర్వహించడం జరుగుతుందని, ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో క్రీడలలో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కాగజ్‌నగర్‌లో బీఆర్ఎస్‌దే చైర్మన్ పదవి

**- మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప**

**కాగజ్‌నగర్, ప్రభాతవార్త:**



మున్సిపల్ చైర్మన్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కలిసి పనిచేస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆరోపించారు. కాగజ్‌నగర్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దేశంలో ఎక్కడా లేని విధంగా ఇక్కడ రెండు పార్టీలు ఒకటై ప్రచారం నిర్వహించాయని ఆయన ఆరోపించరు. కొన్ని వార్డుల్లో బీజేపీకి మద్దతుగా కాంగ్రెస్ నాయకులను నిలబెట్టారని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీని ఓడించడమే లక్ష్యంగా ఇరు పార్టీలు అంతర్గతంగా ఒప్పందం కుదుర్చుకున్నాయని, మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిని నిలబెట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. కొందరు కౌన్సిలర్లను క్యాంపులకు తరలించే యత్నాలు కూడా జరుగుతున్నాయని ఆరోపించారు. అయితే ఎలాంటి రాజకీయ పరిణామాలు జరిగినా 16వ తేదీన బీఆర్ఎస్ పార్టీ చైర్మన్ పదవిని కైవసం చేసుకుంటుందని కోనప్ప ధీమా వ్యక్తం చేశారు. పార్టీ శ్రేణులు ఐక్యంగా ఉన్నాయని, బీఆర్ఎస్‌కు ప్రజల మద్దతు బలంగా ఉందన్నారు. అభివృద్ధి పనుల ఫలితమే తమ ఈ విశ్వాసమని పేర్కొన్నారు.

# కౌంటింగ్ ప్రక్రియను సమర్థవంతంగా చేపట్టాలి


మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి


శిక్షణకు హాజరైన ఎన్నికల అధికారులు

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:**

రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని ఆసిఫాబాద్, కాగజ్ నగర్ మున్సిపాలిటీలకు జరిగిన ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపు ప్రక్రియ సమర్థవంతంగా చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. గురువారం జిల్లాలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఆసిఫాబాద్ మున్సిపల్ ఎన్నికల అధికారులతో కౌంటింగ్ ప్రక్రియపై నిర్వహించిన కార్యక్రమానికి మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు అలోక్ కుమార్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఆసిఫాబాద్ మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో ఏర్పాటు చేయడం జరిగిందని, కౌంటింగ్ కేంద్రంలో 2 కౌంటింగ్ హాల్‌లను ఏర్పాటు చేసి ఒక్కొక్క కౌంటింగ్ హాల్‌లో 5 టేబుళ్లు ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఒక్కొక్క రౌండ్ కు 10 వార్డుల చొప్పున 2 రౌండ్లలో 20 వార్డుల లెక్కింపు పూర్తి చేయవలసి ఉందని, కౌంటింగ్ సిబ్బంది ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు లోబడి విధులు నిర్వహించాలని తెలిపారు. ప్రతి టేబుల్ వద్ద అభ్యర్థి అభ్యర్థి తరపున ఏజెంట్లు ఉంటారని, ప్రతి బ్యాలెట్ పేపర్ ను క్షుణ్ణంగా ఏజెంట్ల సమక్షంలో పరిశీలించి లెక్కించాలని తెలిపారు. ప్రతి టేబుల్ కు ఒక సూపర్వైజర్, ఇద్దరు కౌంటింగ్ సహాయకులు విధులు నిర్వహిస్తారని, కౌంటింగ్ రోజు ఉదయం 6:30 గంటలకు కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఆసిఫాబాద్ మున్సిపల్ కమిషనర్ గజానన్, మాస్టర్ ట్రైనర్ ఊషన్న, రిటర్నింగ్ అధికారులు, కౌంటింగ్ సూపర్వైజర్లు, కౌంటింగ్ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.


నామినికి చెక్కు అందజేస్తున్న మేనేజర్ అవినాష్

## నామినికి బీమా చెక్కు పంపిణీ

**తాండూర్, ఫిబ్రవరి 12, ప్రభాత వార్త :**

ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకంలో భాగంగా నామినీ కొంపల్లి భీమయ్య కు మంజూరైన రూ.2 లక్షల చెక్కు ను గురువారం తాండూర్ తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ అవినాష్ అందజేశారు. మేనేజర్ మాట్లాడుతూ ఎస్బీఐ జనరల్ ఇన్సూరెన్స్ ద్వారా రూ.2000తో పాలసీ తీసుకుంటే ప్రమాద మరణం జరిగితే నామినీకి రూ.40 లక్షల పరిహారం అందుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ఇన్సూరెన్స్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్.బి.ఐ, సి.ఎఫ్.ఎల్ కౌన్సిలర్లు ఎన్నం అశోక్ , రవి, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.



ఆసిఫాబాద్ మున్సిపల్ కార్యాలయం

## ర్యాలీలు, సభలు, సమావేశాలకు అనుమతి లేదు: ఏసిపి రవి కుమార్

**రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త**

క్యాతన్‌పల్లి, మున్సిపాలిటీలలో జరిగిన మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా కౌంటింగ్ కేంద్రం వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, పారదర్శకంగా ఫలితాలు ప్రకటించేందుకు కఠినమైన మూడంచెల భద్రత ఏర్పాట్లు చేసినట్లు బెల్లంపల్లి ఏ.సి.పి రవి కుమార్ తెలిపారు. క్యాతన్ పల్లి మున్సిపాలిటీ, రామకృష్ణాపూర్ పట్టణంలోని ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించి, విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. స్ట్రాంగ్ రూమ్‌లు,కౌంటింగ్ కేంద్రాలను సందర్శించి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు.ఓట్ల లెక్కింపు భద్రతలో భాగంగా కౌంటింగ్ కేంద్రాల లోపలి భాగం, బయట ప్రాంగణం, వెలుపలి ప్రధాన రహదారుల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.కౌంటింగ్ కేంద్రం చుట్టూ 100 మీటర్ల పరిధిలో వెలుపలి రహదారుల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి, అనధికార వాహనాలు, వ్యక్తులకు అనుమతి లేకుండా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.ప్రస్తుతం 144 సెక్షన్ అమలులో ఉన్నందున ప్రజలు గుంపులుగా చేరకుండా ఉండాలని సూచించారు.ప్రజలు రాజకీయ ప్రతినిధులు పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు.రిటర్నింగ్ అధికారి జారీ చేసిన ఫోటో గుర్తింపు కార్డును భద్రతా సిబ్బందికి చూపించిన వారికే కౌంటింగ్ కేంద్రంలోకి ప్రవేశం ఉంటుందని తెలిపారు.మొబైల్ ఫోన్లు,ఎలక్ట్రానిక్ పరికరాలు ,లైటర్లు వంటి నిషేధిత వస్తువులను కౌంటింగ్ హాల్లులోకి తీసుకెళ్లేందుకు అనుమతి లేదన్నారు. ర్యాలీలు,సభలు, సమావేశాలకు అనుమతి లేదని, బాణాసంచా డీజేలను పూర్తిగా నిషేధించినట్లు స్పష్టం చేశారు. అధికారులు, పోలీసులు,ఏజెంట్లకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ ప్రక్రియ జరిగేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.




## గెలిచిన అభ్యర్థులు ఎన్నికల నియమావళికి లోబడి ఉండాలి

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త;**



గెలిచిన అభ్యర్థులు ఎన్నికల నియమావళికి లోబడి ఉండాలని, నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని జిల్లా ఎస్పీ ఎస్పీ నితిక పంత్ గురువారం హెచ్చరించారు. లెక్కింపు కేంద్రాల వద్ద శాంతిభద్రతలు కాపాడేందుకు ఎలాంటి అసాంఘిక చర్యలు చోటుచేసుకోకుండా చూసేందుకు పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని, కౌంటింగ్ కేంద్రాల వెలుపల 163 బిఎన్ఎస్ఎస్ అమలులో ఉంటుందని తెలిపారు. ఫలితాల అనంతరం విజయోత్సవ ర్యాలీలు, బైక్ ర్యాలీలు, డీజేలు, టపాకాయలు కాల్చటం, ఊరేగింపులకు ఎలాంటి అనుమతి లేదని, శాంతి భద్రతలకు భంగం కలిగించే చర్యలు పూర్తిగా నిషేధమని, దీనికి గాను జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసిందన్నారు. ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించడం కోసం సంబంధిత అధికారుల ఉత్తర్వుల మేరకు వారు నిర్దేశించిన తేదీల్లో మాత్రమే జరుపుకోవాలని సూచించారు. ఎవరైనా నియమావళిని ఉల్లంఘించినా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తిస్తే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలందరూ శాంతి, సామరస్య వాతావరణాన్ని కాపాడాలని, ఫలితాలను పరస్పర గౌరవంతో స్వీకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.



## ఆపరేటర్ల వేతనాలు వెంటనే చెల్లించాలి

**తాండూర్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :**

మండలంలోని మిషన్ భగీరథ ఆపరేటర్లకు చెల్లించాల్సిన ఆరు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. మిషన్ భగీరథ సూపర్‌వైజర్ కు గురువారం ఆపరేటర్లు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆపరేటర్లు మాట్లాడుతూ ప్రతినెల వేతనాలు రాక కుటుంబ పోషణ భారంగా మారిందని, తమ బతుకులు దయనీయంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 20 తేదీలోగా వేతనాలు చెల్లించాలని లేనిపక్షంలో విధులను బహిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఆపరేటర్లు లింగయ్య, శంకర్, ఆనంద్ రావు, శ్రీనివాస్, అరుణ్, రాజేందర్, గణేష్, ఇమ్రాన్ ఖాన్, వెంకటేష్, ప్రతాప్, ముబిన్ అహ్మద్ పాల్గొన్నారు.

## నేడు పుర ఎన్నికల ప్రజా తీర్పు...

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:**

కుమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో రెండో సాధారణ ఎన్నికలు బుధవారం ప్రశాంతంగా ముగిసాయి. జిల్లాలోని రెండు మున్సిపాలిటీల్లో ఆసిఫాబాద్ పురపాలక సంఘములో 20 వార్డులు, కాగజ్‌నగర్‌లో 30 వార్డులు ఉన్నాయి. ఆసిఫాబాద్ పురపాలిక సంఘంలో మొదటి సారి ఎన్నికలు నిర్వహించడంతో అభ్యర్థుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఆసిఫాబాద్ పురపాలక సంఘంలో 77 శాతం పోలింగ్ నమోదైంది.దీంతో ఈ ఎన్నికల ఫలితాలు ఎలా ఉంటాయోనని భారీ అంచనాలు నెలకొన్నాయి. బ్యాలెట్ పత్రాల్లో ఓటర్లు తమ నిర్ణయాన్ని ఉంచారు. మరి కొన్ని గంటల్లో ప్రజలు ఇచ్చే తీర్పుతో అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. ఏ వార్డులో ఎవరు విజయం సాధిస్తారోనని నాయకులు లెక్కలు వేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో పోలింగ్ ముగిసిన తర్వాత జిల్లా కేంద్రంలో నిర్వహించిన అనధికార సర్వే ఫలితాలు ఆసక్తికరంగా మారాయి. అధికార పార్టీ కాంగ్రెస్ తో పాటు బీఆర్ఎస్ పార్టీకి సమానంగా స్థానాలు దక్కే అవకాశం ఉన్నదని, బీజేపీకి సింగిల్ డిజిట్ స్థానాలు దక్కే అవకాశాలు ఉన్నాయని తెలిపాయి. ఒకవేళ ఇదే జరిగితే ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్మన్ పదవి దక్కించెందుకు ఇరు పార్టీలకు బిజెపి అభ్యర్థులు కీలకం కానున్నారు.

## బుగ్గ రాజేశ్వర స్వామి కల్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రిక విడుదల

**బెల్లంపల్లి, ప్రభాతవార్త**



మహా శివరాత్రి వైభవాన్ని పురస్కరించుకొని బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామ పరిధిలోని శ్రీ బుగ్గ రాజేశ్వర స్వామి దేవాలయంలో నిర్వహించనున్న స్వామివారి దర్శనం, కల్యాణోత్సవానికి సంబంధించి ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, బెల్లంపల్లి ఏసీపి రవికుమార్, బెల్లంపల్లి మండల తహసిల్దార్ కృష్ణ, ఆర్ఐలు ప్రత్యేకంగా ఆహ్వానిస్తూ ఆహ్వాన పత్రికను అందజేశారు. అదేవిధంగా మాజీ జెడ్పిటిసి బెల్లంపల్లి కారుకూరి రామచందర్, నాతరి స్వామి లకు కల్యాణోత్సవ ఆహ్వాన పత్రిక అందించారు. ఈ కార్యక్రమంలో కారుకూరి రామచందర్, నాతరి స్వామి చేతుల మీదుగా కల్యాణోత్సవానికి సంబంధించిన వాల్ పోస్టర్స్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో, ఆలయ కమిటీ చైర్మన్, డైరెక్టర్లు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# లేబర్ కోడ్‌లు రద్దు చేయాల్సిందే...

(మొదటిపేజీ తరువాయి)

కార్మిక సంస్కరణలు, నాలుగు లేబర్ కోడ్‌లు కేవలం యజమానులకు లాభం చేకూర్చేలా ఉన్నాయని, ఇవి కార్మికుల ఉద్యోగ భద్రతను ప్రశ్నార్థకం చేస్తున్నాయని మండిపడ్డారు. తక్షణమే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యుత్ రంగ సంస్కరణలను నిలిపివేయడంతో పాటు, ఉపాధి హామీ పథకంలో ఎలాంటి మార్పులు చేయకూడదని, నూతన విద్యా విధానాన్ని వెనక్కి తీసుకోవాలని నేతలు స్పష్టం చేశారు. ఈ పోరాటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరై తమ పూర్తి మద్దతును ప్రకటించారు. కార్మికుల హక్కుల కోసం చేసే ఏ పోరాటానికైనా తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బుద్దే విజయ్, పెరుమండ్ల వెంకటేశం గౌడ్, తలండి సర్పంచ్ నైతం మంగు, గ్రామ పంచాయతీ వర్కర్స్ జిల్లా అధ్యక్షుడు సుద్దాల తిరుపతి, ఆడ శ్యామ్ రావు, గాజుల శ్రీనివాస్ గౌడ్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రంగు లచ్చ గౌడ్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**నస్పూర్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సింగరేణి కార్మిక సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఒక్కరోజు దేశవ్యాప్త సమ్మెలో భాగంగా గురువారం శ్రీరాంపూర్ ఏరియాలోని గనులపై జేఏసీ ఆధ్వర్యంలో కార్మికులు భారీ నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీరాంపూర్ బస్టాండ్ వద్ద ధర్నా, రాస్తారోకో చేపట్టి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నేతలు మాట్లాడుతూ కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని తీవ్రంగా తప్పుబట్టారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ఐఎన్టీయూసీ సీనియర్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ జెట్టి శంకర్ రావు, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి రాజారెడ్డి, టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కె. సురేందర్ రెడ్డి, ఐఎఫ్టియు రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థకు చెల్లించాల్సిన సుమారు 47 వేల కోట్ల రూపాయల బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఒత్తిడి తెచ్చారు. బొగ్గు ఉత్పత్తి పనుల్లో కేవలం పర్మనెంట్ కార్మికులనే నియమించాలని టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి సురేందర్ రెడ్డి, ఐఎఫ్టియు రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ పేర్కొన్నారు. సింగరేణిలో కొత్త బొగ్గు గనులు ప్రారంభించడంతో పాటు మెడికల్ బోర్డును ఏర్పాటు చేసి కార్మికులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్మికులందరికీ సొంత ఇంటి పథకం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, ఎస్కె బాజీ సైదా, ఐఎన్టీయూసీ నాయకులు గరిగె స్వామి, జీవన్ జోయల్, సిఐటియు నాయకులు బాలాజీ, చంద్రశేఖర్, టీబీజీకేఎస్ నాయకులు బండి రమేష్, పొగాకు రమేష్, ఐఎఫ్టియు నాయకుడు బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.



రాస్తారోకో నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు కార్మికులు



రాస్తారోకో చేస్తున్న సిఐటియు నాయకులు, అంగన్వాడి టీచర్లు, ఆశా కార్యకర్తలు

## బెజ్జూర్‌లో కార్మికుల రాస్తారోకో..

**బెజ్జూర్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:**

కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం బెజ్జూర్ మండల కేంద్రంలో కార్మికులు భారీ నిరసన చేపట్టారు.దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా సిఐటియు ఆధ్వర్యంలో ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రధాన రహదారిపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ ధర్నా కారణంగా దాదాపు అరగంట పాటు బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి. అనంతరం ఎస్ఐ సర్తాజ్ పాషా సిబ్బందితో కలిసి వారికి నచ్చజెప్పి ధర్నా విరమింప చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు వెలిశాల కృష్ణమాచారి, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

## ప్రజావ్యతిరేక విధానాలను వెనక్కి తీసుకోవాలి

**- సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారాం**

**తాండూర్, ఫిబ్రవరి 12, ప్రభాత వార్త :**

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, కర్షక, ఉద్యోగుల వ్యతిరేక విధానాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారాం డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా గురువారం సిఐటియు ఆధ్వర్యం లో తాండూర్ ఐబిలోని జాతీయ రాస్తారోకో నిర్వహించహారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక సంఘాలు, కార్మిక చట్టాలు లేని దేశంగా మార్చాలని ప్రయత్నాలు చేస్తున్నదన్నారు. 4 లేబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఐబి నుండి తహసిల్దార్ ఆఫీస్ వరకు ర్యాలీగా వెళ్లి తహసిల్దార్ జ్యోత్స్న కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, నాన్నయ్య, రాజేశం, అంగన్వాడి టీచర్లు విజయలక్ష్మి, సత్యవతి, లీలారాణి, శారద, సరిత, పావని, కవిత, సావిత్రి, భాగ్య, నర్సు బాయ్, హారిక, విజయలక్ష్మి, గంగుబాయి, సునీత, అనసూర్య, రెడ్డి మల్లక్క, వరలక్ష్మి, వసంత, ఇంద్రజ, రాజేశ్వరి, లక్ష్మి, సుజాత, హనుమక్క, తదితరులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు భారీ స్పందన

**బెల్లంపల్లి, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త**

ప్రధాని నరేంద్ర మోడీ 4 లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా గురువారం రోజున జరుగుతున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా బెల్లంపల్లి సింగరేణి సివిక్, సివిల్ విభాగంలో విధులు బహిష్కరించి నిరసన చేపట్టి అంబేద్కర్ చౌరస్తాలో నాలుగు లేబర్ కోడ్ పత్రాల దహనం చేసిన కార్మిక సంఘాల ఐక్యవేదిక. గురువారం రోజున జరుగుతున్న దేశవప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా ఐఎఫ్టియు, కార్మిక సంఘాల ఐక్యవేదిక నిరసన కార్యక్రమం చేపట్టింది. కార్మిక హక్కులను ఉద్యోగ భద్రతను హరించే నాలుగు లేబర్ కోడ్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున కార్మికులు నినాదాలు చేసినారు. కార్పొరేట్లకు దేశ పారిశ్రామిక రంగాన్ని కట్టబెట్టడానికి అడ్డంకిగా ఉన్నాయని, కార్పొరేట్ల ప్రయోజనాలు నెరవేర్చాలంటే 29 చట్టాలను నాలుగు కోడ్లుగా కుదించి అమలు చేయుటకు పూనుకున్నది. ఇప్పటికే దేశంలోని పారిశ్రామిక రంగం పూర్తిగా ప్రైవేటు కార్పొరేటు కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ గుప్పెట్లోకి వెళ్లిపోయిందని అన్నారు.

దేశ ప్రజలు కార్మికులు రైతుల కంటే కూడా కార్పొరేట్, అమెరికా సామ్రాజ్యవాద అనుకూల విధానాలే నరేంద్ర మోడీ దేశభక్తిగా భావిస్తున్నారని కార్మిక సంఘాలు ధ్వజమెత్తాయి. అమెరికాతో కుదుర్చుకున్న ట్రేడ్ డీల్ (తాత్కాలిక వ్యాపార ఒప్పందం) మోడీ చేసుకున్నారని అన్నారు. వ్యాపార ఒప్పందం వలన చౌకగా దొరికే రష్యా చమురు కంటే, తాను ఆక్రమించుకున్న వెనిజులా నుంచి అధిక ధరకు తమరు దిగుమతి చేసుకునే ఒప్పందం, వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులు రేపు భారతదేశ ప్రజలకు విపరీతధరల భారాన్ని మోప నున్నాయని ఈ అధిక ధరల భారం ఇప్పటికే సామాన్య మధ్యతరగతి ఉద్యోగ జీవులను, నిజ వేతనాలు పడిపోయి ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తున్నాయని అన్నారు. నరేంద్ర మోడీ కార్మిక ప్రజా రైతాంగ వ్యతిరేక విధానాలను తరిమికొట్టడానికి ఈ దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జరుగుతుందని, కార్మికులు ప్రజలు రైతాంగం పోరాడి నరేంద్ర మోడీ నాలుగు లేబర్ కోడ్ లను అమెరికాతో చేసుకున్న వ్యాపార ఒప్పందాన్ని రద్దు చేసుకునే వరకు పోరాడాలని కార్మికులకు కర్షకులకు, ప్రజలకు పిలుపునిచ్చారు. సమ్మెలో పాల్గొన్న కార్మికులకు విప్లవ జెజేలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎండి. చాంద్ పాష, జిల్లా అధ్యక్షులు తాళ్లపల్లి శ్రీనివాస్, పిడిఎస్యు జిల్లా అధ్యక్షులు చరణ్, టిఎన్టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, టి. మని రామ్ సింగ్, గైని. తిరుపతి, బొల్లు.మల్లయ్య, పుల్లూరి పోశం, టియుసిఐ నాయకులు, శంకర్, రాజ్ కుమార్, ఎస్‌జికెఎస్, కన్వీనర్ అంబాల మహేందర్, ఎన్నం శంకర్, టిఎస్యుఎస్, కార్యనిర్వాహక అధ్యక్షుడు నీరటి రాజన్న, ఎస్సిసిడబ్ల్యూయు, టిఎఫ్టియు, శ్యామ్, కృష్ణవేణి, వెంకటి, కొమురయ్య, శ్రీనివాస్, గణేష్, చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.






డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసిన కార్మికులు.

## కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ర్యాలీ

**చింతలమానేపల్లి, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:**

కేంద్ర ప్రభుత్వం చేస్తున్నటువంటి కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మండల కేంద్రంలో గురువారం సమ్మె నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి శివాజీ చౌరస్తా వరకు కార్మికులు ప్రదర్శన చేపట్టారు.మండల కేంద్రంలోని డా.బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి వినతి పత్రం అందజేశారు అనంతరం స్థానిక తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల అధ్యక్షురాలు శ్రీలత,మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని, కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని కేంద్ర ప్రభుత్వంను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు విలాస్, నిర్మల, తారబాయి, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.